క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

మునగాల : మునగాల ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ ఎలక బిందు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి మండలంలోని అధికారులు తమ నివేదికలతో హాజరు కావాలని, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తప్పనిసరిగా పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

మోతెలో..

మోతె : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆదివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హరిసింగ్ నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కోదాడ ఎమ్మెల్యే పద్మావతి హాజరు కానున్నారని, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ఉదయం 11 గంటలకు విధిగా హాజరు కావాలని కోరారు.

3న గరిడేపల్లిలో..

గరిడేపల్లి : మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని జనవరి 3న ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కన్మంతరెడ్డి వనజ శనివారం తెలిపారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

నేడు ముగ్గుల పోటీలు

మఠంపల్లి : మఠంపల్లిలోని శుభవార్త దేవాలయం ఆవరణలో స్థానిక శుభోదయ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు గాదె జయభారత్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. పోటీల్లో ప్రతిభ కనరిచిన మహిళలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. యూత్ వైస్ ప్రెసిడెంట్ పవన్‌రెడ్డి, కార్యదర్శి బాలరెడ్డి, సభ్యులు రాజేష్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, అఖిల్‌రెడ్డి, మనీష్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి

చిలుకూరు : తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ చిలుకూరు మండల నూతన కార్యవర్గాన్ని శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బచ్చయ్య, నక్కా శ్రీనివాసులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కోదాడ డివిజన్ కార్యదర్శి నాగేశ్వరరావు, పి.శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు టీ.ఏ.జనార్దన్‌రావు, జెవీవీ సీనియర్ నాయకులు చందా శ్రీనివాస్‌రావు, టీఎల్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్‌గా బాబు

నేరేడుచర్ల : ఎమ్మార్పీఎస్ నేరేడుచర్ల మండల ఇన్‌చార్జ్‌గా చిలక బాబు నియమితులయ్యారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలేటి లక్ష్మణ్ చిలక బాబుకు శనివారం నేరేడుచర్లలో నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాటయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జానయ్య, శ్రీకాంత్, లక్ష్మణ్, నగేష్, శ్యామ్, రాజేష్, ఉపేందర్, నాగయ్య, రమేష్ తదితరులు ఉన్నారు.

ముగిసిన శాస్త్రీయ వైజ్ఞానిక కళాప్రదర్శన



ఎన్‌సీఎల్ పాఠశాలలో కళా ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి గ్రామ పంచాయతీ పరధిలోని ఎన్‌సీఎల్ పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన శాస్త్రీయ, భాషా, వైజ్ఞానిక కళా ప్రదర్శనలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పూర్ణచందర్ రావు, వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచిమార్గం ఎంచుకోవాలి

నేరేడుచర్ల : చిన్నతనం నుంచే కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఎస్‌ఐ పరమేష్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షీటీం ఆధ్వర్యంలో గంజాయి, డ్రగ్స్, సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత మంచిమార్గాన్ని ఎంచుకోవాలన్నారు. విద్యార్థినులను వేధిస్తే 100 నంబర్ లేదా 1930కి ఫోన్ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, కౌన్సిలర్ ఆకారపు లలితభరత్, కృష్ణవేణి పాఠశాల ప్రిన్సిపాల్ మురారిశెట్టి రమేష్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, కళాబృందం సభ్యులు ఎల్లయ్య, గోపయ్యాచారి, నాగార్జున, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్



కోదాడఅర్బన్ : లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా జడ్జి రాజగోపాల్

కోదాడఅర్బన్ : వివాదాలను రాజీమార్గంలో పరిష్కరించుకోవడమే రాజమార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ అన్నారు. శనివారం కోదాడ కోర్టులో నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కటి మార్గమని తెలిపారు. లోక్ అదాలత్‌తో కక్షిదారులకు డబ్బు, సమయం ఆదా అవుతాయన్నారు. సివిల్, క్రిమినల్ కేసులతో పాటు రాజీ పడదగిన అన్ని కేసులను పీడీఎం కోర్టులో 2,016, ఏడీఎం కోర్టులో 2,184 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. ఆయా కేసులలో అపరాధ రుసుం కింద రూ.2,89,930లు వసూలు అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో కోదాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్యాంసుందర్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి భవ్య, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగార్జున, శరత్‌బాబు, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

మెగా లోక్ అదాలత్‌ను పరిశీలించిన జడ్జి

హుజూర్‌నగర్ : పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో శనివారం జరిగిన జాతీయ మెగా లోక్ అదాలత్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్ నిర్వహణ తీరును పరిశీలించారు. లోక్ అదాలత్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తున్న న్యాయమూర్తులు జిట్టా శ్యాంకుమార్, మారుతీప్రసాద్, పోలీస్ సిబ్బంది, న్యాయవాదులను ఆయన అభినందించారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో కక్షిదారుల కోసం ఏర్పాటు చేసిన పులిహోర పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

రాజీతో వాది, ప్రతివాదుల విజయం

హుజూర్‌నగర్ : కేసులను రాజీ చేసుకుంటే వాది, ప్రతివాదులు విజయం సాధించినట్లు అవుతుందని సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని న్యాయస్థానంలో జరిగిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో కక్షిదారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్‌లో జారీ చేసిన తీర్పు అంతిమమైనదని, దానిపై అప్పీలు చేసుకునే అవకాశం లేదని తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో 7 సివిల్ కేసులు, 4,173 క్రిమినల్ కేసులలో కక్షిదారులు రాజీపడగా కేసులను కొట్టివేస్తున్నట్లు న్యాయమూర్తులు తీర్పులు వివరించారు. వివిధ కేసులలో కక్షిదారులు రూ.15,41,700లను జరిమానా రూపంలో కోర్టుకు చెల్లించారు. బ్యాంకులకు చెల్లించవలసిన అప్పుల బాపతు రూ.8 వేలను కక్షిదారులు బ్యాంకులకు చెల్లించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు కుక్కడపు బాలకృష్ణ, సైదా హుస్సేన్, నురేష్‌కుమార్, యాదగిరి, నరసింహారావు, ఏజీపీ వీజీకే మూర్తి, కాల్వ శ్రీనివాసరావు, సీఐలు రామలింగారెడ్డి, రామకృష్ణారెడ్డి, న్యాయవాదులు, ఎస్‌ఐలు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్

క్యాంపు కార్యాలయాన్ని సిద్ధం చేయాలి

● కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి



హుజూర్‌నగర్ : క్యాంపు కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతి

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని అని హంగులతో సిద్ధం చేయాలని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. పట్టణంలోని ఫణిగిరి గుట్ట వద్ద గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వచ్చేవరకు భవనంలో అన్ని వసతులు కల్పించాలని అధికారులకు చెప్పారు. రంగులు ఇతర పనులు పూర్తి చేయించాలన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఏఈ శివకుమార్, కాంగ్రెస్ నాయకులు తన్నీరు మల్లికార్జున్, గెల్లి రవి, కౌన్సిలర్ శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌రెడ్డికి పరామర్శ..

పట్టణంలో కాంగ్రెస్ నాయకుడు అరెర్ల శ్రీనివాస్‌రెడ్డి తల్లి సీతారావమ్మ ఇటీవల మృతి చెందారు. శనివారం ఎమ్మెల్యే పద్మావతి ఆయనను పరామర్శించి సీతారావమ్మ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆమెవెంట కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్, కేఎల్ఎన్ ప్రసాద్, తదితరులు ఉన్నారు.

ప్రతిఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలి

చిలుకూరు : ప్రతిఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి అన్నారు. శనివారం మండలంలోని జానకీనగర్ గ్రామంలో జరిగిన అయ్యప్ప మాలధారుల ఇరుముడి మహోత్సవంలో ఆమె పాల్గొని ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం మాలధారులు ఇరుముడి ధరించి శబరికి బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో అయప్ప స్వాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

నడిగూడెం : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నడిగూడెం ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ సుబ్రహ్మణ్యం కోరారు. శనివారం మండల పరిధిలోని ఎకలాస్‌ఖాన్‌పేట, కాగితరామచంద్రాపురం గ్రామాల్లో నిర్వహించిన వికసిత భారత సంకల్ప యాత్రలో పాల్గొని మాట్లాడారు. విశ్వకర్మ యోజన పథకం ద్వారా వివిధ రకాల చేతి వృత్తుల వారికి ఉచిత వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం కేంద్ర పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దున్నా సతీష్, కాగితరామచంద్రాపురం సర్పంచ్ మంచికంటి వెంకటరెడ్డి, ఎకలాస్‌ఖాన్‌పేట ఉపసర్పంచ్ దేవబత్తిని రమేష్ ప్రసాద్, నాయకులు లతీఫ్, రొండ్ల శ్రీనివాసరెడ్డి, పరబ్రహ్మాచారి, బండారు శోభారాణి, లక్ష్మీనారాయణ, ఉపేందర్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో న్యూఇయర్ సందడి

నడిగూడెం : మండల కేంద్రంలోని పాఠశాలల్లో శనివారం ముందస్తు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. శ్రీసాయి పబ్లిక్ స్కూల్‌లో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బుస్సా సులోచన, ఉపాధ్యాయులు వీరయ్య, సైదులు, హర్ష, లక్ష్మి, రమ్య, మల్లిక, హనీఫా, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌వి టెక్నో స్కూల్‌లో..

మండల కేంద్రంలోని ఎస్‌వి టెక్నో స్కూల్‌లో కేక్ కట్ చేశారు. ప్రిన్సిపాల్ కాసాని ఉపేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస్‌వి టెక్నో స్కూల్‌లో కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపాల్ ఉపేందర్, విద్యార్థులు

కొనసాగుతున్న ధనుర్మాస పూజలు



హుజూర్‌నగర్ : గజవాహన సేవలో పాల్గొన్న పూజారులు, భక్తులు



హుజూర్‌నగర్ రూరల్ : స్వామివారికి వెండి పిల్లనగ్రోవి అందజేస్తున్న దాత

హుజూర్‌నగర్‌రూరల్ : ధనుర్మాసం సందర్భంగా మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీశాల్మలీకంద ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, ఆరాధన, అష్టోత్తర శతమావళి, గోత్రనామార్చన, ఆరగింపు, మంగళాశాసనం, పాశుర ఉచ్ఛరణ, తీర్థప్రసాదగోష్టి తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం తెల్లబోయిన పుల్లయ్య- హేమలత దంపతులు రూ.7116 విలువ గల వెండి పిల్లనగ్రోవిని అర్చకులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గండు సైదులు, ఈఓ ఎంపి లక్ష్మణరావు, అర్చకులు, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గజవాహన సేవ

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీవేణుగోపాల సీతారామచంద్రస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం ఆలయంలో అమ్మవారి గజవాహన సేవ వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకృష్ణ, గోదా, రామానుజ అష్టోత్తరాలను పఠించి తిరుప్పావై సేవాకాలాన్ని శ్రావ్యంగా గానం చేశారు. పూజారులు, ఆలయ అధికారులు, ధర్మకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

కోదాడఅర్బన్ : విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఎన్ఆర్ఎస్ జూనియర్ కళాశాల చైర్మన్ వడ్డె రాజేష్ చౌదరి అన్నారు. శనివారం ఎన్ఆర్ఎస్ జూనియర్ కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నత విద్య కోసం వెళ్లేందుకు ఇంటర్మీడియట్ కోర్సు కీలకమని, ఈ దశలో విద్యార్థి చేసే కృషి, ఉన్నత స్థానాలకు ఎదగాలనే పట్టుదల వారిని జీవితంలో ఏ స్థానంలో నిలబడాలో నిర్ణయిస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మనోహర్‌రెడ్డి, కరస్పాండెంట్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ వేణుగోపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

గంజాయి వినియోగిస్తే కఠిన చర్యలు

హుజూర్‌నగర్ : న్యూ ఇయర్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని, గంజాయి వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ హరికృష్ణ హెచ్చరించారు. శనివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని బైక్‌పై త్రిబుల్ రైడింగ్ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్లపై రాకపోకలకు అంతరాయం కలిగించడం, భారీ స్పీకర్లు పెట్టి ప్రజలను ఇబ్బంది పెట్టడం, రోడ్లపై మద్యం సేవిస్తూ తిరగడం వంటివి చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. న్యూఇయర్ వేడుకలపై ప్రత్యేక నిఘా పెట్టామని ఆయన తెలిపారు.

31 వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

నేరేడుచర్ల : డిసెంబర్ 31 వేడుకలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని నేరేడుచర్ల ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్ కోరారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల ప్రజలకు ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం రాత్రి 10గంటల నుంచి స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పోలీసుల సూచనలు పాటించాలని ప్రజలను కోరారు.

మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాట కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులతో మునగాల ఎస్‌ఐ లోకేష్

మునగాల : మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో శనివారం మాదక ద్రవ్యాల వ్యతిరేక పోరాట కమిటీని నియమించినట్లు స్థానిక ఎస్‌ఐ పి.లోకేష్ తెలిపారు. కమిటీ అధ్యక్షురాలిగా పాఠశాల ప్రిన్సిపాల్ మద్దూరి సాయిఈశ్వరి, సమన్వయకర్తగా వి.అంబేద్కర్, కమిటీ సభ్యులుగా ఉడుం కృష్ణ (పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్) కాసాని నాగేశ్వరరావు, ఆర్.లక్ష్మీనారాయణ, రవీందర్‌రెడ్డి, షేక్ పీర్‌సాహెబ్, ఆర్వీఆర్ ప్రసాద్, డి.సంతోష్‌ను నియమించినట్లు తెలిపారు. మాదక ద్రవ్యాలు లేని సమాజాన్ని నిర్మించేందుకు ఈ కమిటీ కృషిచేయాలని సూచించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

● ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి



హుజూర్‌నగర్ : ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి



కోదాడరూరల్ : రెడ్లకుంటలో దరఖాస్తులు స్వీకరిస్తున్న జెడ్పీటీసీ కృష్ణకుమారి, సర్పంచ్



గరిడేపల్లి : గానుగబండలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీఓ వనజ

హుజూర్‌నగర్ : ప్రజాపాలనలో భాగంగా అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లో జరిగిన ప్రజాపాలన వార్డు సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు ప్రభుత అధికారులే ప్రజల దగ్గరకు వచ్చారని చెప్పారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి సందేశాన్ని సభలో చదివి వినిపించారు. కాగా, మున్సిపాలిటీలోని 5, 6, 19, 20వ వార్డులలో ప్రజాపాలన వార్డు సభలు నిర్వహించగా, ఈ సభలలో మొత్తం 1,437 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమాలలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు, ఇన్‌చార్జ్‌లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలను అర్హులందరికీ అందజేస్తామని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వేపలసింగారంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, ఎంపీడీఓ లావణ్యతో కలిసి ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి, ఎంపీటీసీ ముడెం గోపిరెడ్డి, చక్కెర వీరారెడ్డి, కార్యదర్శి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ఆర్డీఓ

మఠంపల్లి : ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన గ్రామ సభలో ఆయన దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. అదేవిధంగా పెదవీడు, వరదాపురం తదితర గ్రామాల్లో ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ సంధ్యారాణి, ఎంపీపీ పార్వతి, ఎంపీడీఓ జానకిరాములు, ఎంపీఓ ఆంజనేయులు, సర్పంచ్‌లు సయ్యద్‌బీబీ కుతుబ్, బచ్చలకూరి అఖిలబాబు, మాజీ సర్పంచ్ ఆదూరి స్రవంతి కిషోర్‌రెడ్డి, కార్యదర్శి లక్ష్మణ్‌నాయక్‌స్వామి, ఉపసర్పంచ్ జాల కిరణ్‌యాదవ్, ఎంపీటీసీ ప్రభుదాసు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి

నేరేడుచర్ల : ఆరు గ్యారంటీ పథకాలకు అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య అన్నారు. శనివారం మండలంలోని సోమారం, దాచారం గ్రామాల్లో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం మండల ఇన్‌చార్జ్, జిల్లా సంక్షేమ అధికారిని జ్యోతి పద్మతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, ఎంపీడీఓ శంకరయ్య, ఎంపీఓ విజయకుమారి, ఏఈ శ్రీనివాస్, సబ్ ఇంజనీర్ గురువయ్య, సర్పంచ్‌లు వాడపల్లి రమణనగేష్, సుశీల, ఎంపీటీసీ మధురవాణి, ఏఎస్‌ఐ సైదులు, ఉపాధి హామీ అధికారి సతీష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు కరుణశ్రీ, సుజాత, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు ఉన్నారు.

నడిగూడెం : గ్రామ సభలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎస్‌డీ.ఇమామ్ కోరారు. శనివారం మండలంలోని కరివిరాలలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 12 గ్రామాల్లో ఇప్పటివరకు 4584 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ హేమామాలిని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే 'ప్రజాపాలన'

గరిడేపల్లి : ప్రజా సమస్యలు పరిష్కరించడానికే ప్రభుత్వం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహిస్తుందని ఎంపీడీఓ వనజ, తహసీల్దార్ కవిత తెలిపారు. శనివారం మండలంలోని గానుగబండ, రాయినిగూడెం, కాసవారిగూడెం, అప్పన్నపేట గ్రామాల్లో జరిగిన ప్రజాపాలన గ్రామసభలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారులు శ్రీనివాస్, సంతోష్, మౌనిక, సురేష్, మౌలానా, సంపత్, వీరస్వామి, పాకాల పరమేష్, స్వరూప, భిక్షం, సందీప్, చంద్రారెడ్డి, సుధాకర్, సాయిబాబా, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

చిలుకూరు : ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపడుతోందని ఎంపీపీ బండ్ల ప్రశాంతికోటయ్య, జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీషానాగేంద్రబాబు అన్నారు. శనివారం మండలంలోని సీతారాంపురం, చిలుకూరు, కొండాపురం, మాధవగూడెం గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలు నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరిత, ఎంపీడీఓ ఈదయ్య, సర్పంచ్‌లు కొడారు బాబు, వేనేపల్లి సుగుణమ్మ, రవీందర్, గ్రామ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం, కలకోవ, తాడువాయి గ్రామాల్లో శనివారం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అభయహస్తం పథకాలకు ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. బరాఖత్‌గూడెంలో 852, తాడువాయిలో 698, ముకుందాపురంలో 726, కలకోవలో 480 దరఖాస్తులు అందాయని గ్రామాల టీమ్ అధికారులు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ ఎలక బిందు, జెడ్పీటీసీ నల్లపాటి ప్రమీల, వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాపాలనతో అన్ని వర్గాలకు మేలు

కోదాడరూరల్ : కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరనుందని జెడ్పీటీసీ మందలపు కృష్ణకుమారి, రెడ్లకుంట సర్పంచ్ సాధినేని లీలాఅప్పారావు అన్నారు. శనివారం రెడ్లకుంటలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయశ్రీ, వైస్ ఎంపీపీ మల్లెల రాణి, ఎంపీఓ పాండురంగన్న, ఏఓ రజిని, అధికారులు ఉన్నారు.

2,212 దరఖాస్తుల స్వీకరణ

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని వజినేపల్లి, కిష్టాపురం, చింతిర్యాల, నక్కగూడెం గ్రామాల్లో శనివారం ప్రజాపాలన గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో 2,212 మంది వివిధ పథకాల కోసం దరఖాస్తులు అందజేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమాలలో మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్, ఎంపీడీఓ జగదీష్, తహసీల్దార్ సురేందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, ఇన్‌చార్జ్ అధికారులు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మేళ్లచెరువు : ప్రభుత్వ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పద్మ సైదేశ్వరరావు కోరారు. శనివారం మేళ్లచెరువు, రామాపురం గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలో దరఖాస్తుల స్వీకరించి మాట్లాడారు. మేళ్లచెరువులో 1785 దరఖాస్తులు, రామాపురంలో 729 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ ఇసాక్‌హుస్సేన్, ఎస్‌ఐ సురేష్‌యాదవ్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అన్నదాన పవిత్రతను కాపాడాలి

మఠంపల్లి : అన్నదానం పవిత్రతను ప్రతిఒక్కరూ కాపాడాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కోల నాగేశ్వరరావు, మున్నూరు కాపు సత్రం కమిటీ అధ్యక్షుడు టి. వెంకయ్య కోరారు. శనివారం మండలంలోని మట్టపల్లిలో గల మున్నూరుకాపు అన్నదాన సత్రంలో ప్రతి శనివారం అన్నదానం అనే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి విజయలక్ష్మి వెంకటరమణ, అప్పారావు, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులు సంచరిస్తే పోలీసులకు తెలపాలి

మునగాల : మండలంలో అపరిచిత మహిళలు, పురుషులు సంచరిస్తూ ఆయుర్వేద మందులు ఇస్తామని, పాత సామన్లు కొంటామని చెబుతూ గత కొంతకాలంగా పలు గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఎస్‌ఐ పి.లోకేష్ శనివారం తెలిపారు. పాత సామన్లు ఏరుకోవడానికి కూడా వస్తున్నారని, కావున అపరిచిత వ్యక్తులు తారసపడితే వారి ఫొటో తీసి పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

సీపీఎం మాజీ సర్పంచ్ లచ్చమ్మ మృతి

మోతె : మండలంలోని విభళాపురం గ్రామ సీపీఎం మాజీ సర్పంచ్ కంకణాల లచ్చమ్మ (95) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు, నాయకులు.. లచ్చమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో సీపీఎం నాయకులు ముల్కూరి గోపాల్‌రెడ్డి, ఏసు, నాగం మల్లయ్య, లచ్చమ్మ కుమారులు చంద్రయ్య, రాములు, వెంకన్న, శ్రీను, బంధువులు ఉన్నారు.

మునగాలలో బెంచీల ఏర్పాటు

మునగాల : మండల కేంద్రానికి చెందిన వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ గవర్నర్ వంగవేటి వెంకటగురుమూర్తి తన తాత, అమ్మమ్మ కే.శే.పెనుగొండ సత్యనారాయణ- చూడమ్మ జ్ఞాపకార్థం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో రూ.40 వేలు విలువ గల 12 సిమెంట్ బల్లాలను గ్రామంలోని వివిధ కూడళ్ల వద్ద ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.


సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

హుజూర్‌నగర్ : రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో హుజూర్‌నగర్ పట్టణంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని కాంగ్రెస్ పట్టణ నాయకుడు జక్కుల మల్లయ్య అన్నారు. అప్పటి ఎంపీ ఉత్తమ్ ఎంపీ నిధులు రూ.4 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు జక్కుల మల్లమ్మ, కౌన్సిలర్ ఉపేంద్ర సైదులు, కె.మహేష్, బి.సైదులు, నరేంద్ర, సైదులు, నవీన్, యోహాన్, నాగరాజు, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

మాలధారులకు అన్నదానం

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్‌లో గల గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో శనివారం ఎన్ఆర్ఐ కర్నె చంద్రశేఖర్ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమంలో 350 మంది మాలధారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గాలి శ్రీనివాస్‌నాయుడు, సీతారాంసింగ్, సూర్యారెడ్డి, రంగారావు, నాగరాజు, మాలధారులు ఉన్నారు.

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పట్టణ కమిటీ ఎన్నిక



రవికుమార్‌కు నియామక పత్రం అందజేస్తున్న చింత బాబుమాదిగ

కోదాడఅర్బన్ : తెలంగాణ రాష్ట్ర మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కోదాడ పట్టణ అధ్యక్షుడిగా సోమపంగు రవికుమార్ నియమితులయ్యారు. ఈమేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య పంపిన నియామకపత్రాన్ని ఆ సంఘం రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు, కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చింత బాబుమాదిగ శనివారం కోదాడలో ఆయనకు అందజేశారు. అదేవిధంగా కమిటీ ఉపాధ్యక్షులుగా కలకొండ శ్రీను, కుడుముల శ్రీను, ప్రధాన కార్యదర్శిగా కాంపాటి రామకృష్ణను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సుందర్‌బాబు మాదిగ, గుండెపంగు రమేష్, స్వామి, రంగయ్య, శ్రీను, రాజా, సుందర్‌రావు, ఏసుపాదం, సురేష్, బాలసైదులు పాల్గొన్నారు.